క్లుప్తంగా

గంజాయి క్రయవిక్రయాలు నేరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : నగర పరిధిలో గంజాయి క్రయ విక్రయాలు జరిపినా, గంజాయి సేవించి అల్లర్లకు పాల్పడినా పోలీసులకు సమాచారమివ్వాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ కోరారు. శుక్రవారం హయాతినగరంలో నారీశక్తి- సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానికులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్, బాల్యవివాహలపై చైతన్యం కలిగి ఉండాలన్నారు. డయల్ 112, 100, సైబర్‌సెల్ 1930 నంబర్లకు డయల్‌చేసి సమాచారం అందించాలన్నారు.

నిమజ్జనోత్సవంలో డీజేలు వాడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : వినాయక విగ్రహాల నిమజ్జనాల్లో డీజేలు నిషిద్ధమని, వాడితే చట్టపరంగా చర్యలు తప్పవని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం తన ఛాంబరులో విలేకరులతో మాట్లాడుతూ ఊరేగింపులో మద్యం తాగి అతిగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. అశ్లీల నృత్యాలు వేయరాదన్నారు. రాత్రి 11 గంటల్లోపు నిమజ్జన కార్యక్రమం పూర్తిచేయాలని, నదుల వద్దకు చిన్నారులు తీసుకెళ్లరాదని, విద్యుత్తు వైర్లకు దూరంగా ఉండాలని, గజ ఈతగాళ్ల సహకారం తీసుకోవాలని సీఐ సూచించారు.

మండల కేంద్రం సాధనకు సహకరించాలి




కుప్పిలి గ్రామస్తులతో చర్చిస్తున్న మురపాక మండల సాధన కమిటీ సభ్యులు

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాకలో మండలం ఏర్పాటుకు సహకరించాలని మురపాక మండల సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామస్తులను కలిసి మండల ఆవశ్యకతను వివరించారు. స్థానిక పెద్దలతో సమావేశం ఏర్పాటుచేయగా.. తామంతా సమష్టిగా నిర్ణయం తీసుకుని తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల జెడ్పీటీసీ బల్లాడ హేమమాలిని రెడ్డి, జనార్దనరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్తు.. కారాదు విపత్తు!

- నిర్లక్ష్యం కారణంగా పెరుగుతున్న ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచన




ఎచ్చెర్ల:

ఇటీవల కాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టం చోటుచేసుకుంటాయి. ఇటీవల లావేరు మండలంలోని రెండు ఆవులు ఇదే తరహా ప్రమాదానికి గురై మృతి చెందాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నా వినియోగదారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు నిర్వాహణ పనులను చేపడుతున్నప్పటికీ అవగాహన లోపంతో నష్టపోతున్నారు.



ఎచ్చెర్ల సబ్‌స్టేషన్

ఇవి ప్రధానం..



- నివాసాలు, పరిశ్రమల్లో వైరింగ్ ముఖ్యం. విద్యుత్ వస్తువుల సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడంతో పాటు భవిష్యత్తు అవసరాలు తీర్చేలా పటిష్టమైన నాణ్యమైన రాగి తీగలు కలిగిన వైర్లను వినియోగించాలి. వైరింగ్ రంధ్రాల్లో ఎలుకలు, వర్షపు నీరు చేరకుండా చూసుకోవాలి. శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లతో వైరింగ్ చేయించుకోవాలి.
- విద్యుత్ పరికరాలు, వైరింగ్‌కు ఉపయోగించే తీగలు, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లకు ఇండియా స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) గుర్తింపు ముఖ్యం. ప్రస్తుతం దీనికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఎస్ఐ)గా వ్యవహరిస్తున్నారు. వస్తువులపై ఈ గుర్తు నాణ్యతను సూచిస్తుంది. ఈ గుర్తింపు ఉన్న పరికరాలను ఉపయోగించాలి.
- విద్యుత్ ప్రమాదాలకు ఎర్త్ చేయని పరికరాలే ప్రధాన కారణం. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్ల కు విధిగా ఎర్త్ చేయించాలి. ఎర్త్ చేయని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, ఫ్యుట్వాలను రక్షణ లేకుండా తాకకూడదు. ప్రధానంగా వర్షం పడినప్పుడు జాగ్రత్తపడాలి. తడి ప్రదేశంలో ఇనుపకడ్డీని పాతి దానిని తీగ ద్వారా నివాసాల్లో మెయిన్‌కు, వ్యవసాయ మోటార్లకు అనుసంధానించాలి. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. తద్వారా విద్యుదాఘాతాన్ని, అధిక విద్యుత్ సరఫరాతో పాటు పరికరాలు దగ్ధం కాకుండా నివారించవచ్చు.
- స్తంభం నుంచి విద్యుత్ సరఫరా చేసే సర్వీసు వైరు నాణ్యంగా ఉండాలి. దీనికి ఇన్సులేషన్ ఉన్న జీఐ వైరును సపోర్టుగా వాడడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఉండదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- కరెంట్ పనులు లైసెన్స్ కలిగిన ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలి. ఐఎస్ఐ మార్క్ కలిగిన వైర్లు, స్విచ్‌లు, స్విచ్‌గేర్ తదితర పరికరాలు వాడాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు వేయడం, మరమ్మతులకు పూనుకోవడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం ప్రమాదకరం. వీటిని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలి.
- విద్యుత్ పరికరాలన్నింటికీ ఎర్తింగ్ తప్పనిసరి. కరెంట్ ఉపకరణాలు ఉపయోగించే సమయంలో రబ్బరు చెప్పులు, షూ తప్పనిసరిగా ధరించాలి. ఆరుబయట వాడే వైర్లు, స్విచ్ బోర్డులు వాటర్ ప్రూఫ్ కలిగి ఉండాలి.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే కరెంట్ సరఫరా ఆపివేసి ప్లాస్టిక్ వస్తువు, ఎండు కర్రతో ప్రమాదం జరిగిన వ్యక్తిని వేరుచేయాలి. ప్రమాదానికి గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించాలి.
- వర్షం కురుస్తున్న సమయంలో స్తంభాలను తాకరాదు. తీగలు తెగిపడితే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. కూలర్‌లో నీటిని నింపే సమయంలో తప్పనిసరిగా కరెంట్ సరఫరా నిలిపివేయాలి. సాకెట్ నుంచి మొబైల్ చార్జర్, ఇతర పరికరాలను వేరే చేసే సమయంలో విద్యుత్ సరఫరా ఆపాలి.
- కరెంట్ తీగలు తెగి వాహనాలపై పడితే వెంటనే కిందకు దిగకూడదు. అలా చేస్తే విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది. విద్యుత్ పరికరాలు, తీగలపై దుస్తులు ఆరబెట్టరాదు. విలువైన పరికరాలకు ఎస్పీడీ, సర్జ్ ప్రొటెక్టివ్ డివైజ్‌ను ఉపయోగించాలి.
- ఎత్తయిన భవనాలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, విద్యా సంస్థలపై పిడుగు రక్షణ (లైట్‌నింగ్ ప్రొటెక్షన్) బిగించుకోవాలి. పిల్లల ఆస్పత్రులు, విద్యా సంస్థల్లో షట్టర్ టైప్ సాకెట్ ఔట్‌లెట్లను ఉపయోగించాలి. వంట గదిలో మిక్సీ, గ్రైండర్ వంటి పరికరాల తీగలకు తాకేలా కూరగాయలు తరిగే చాకులు, షార్ప్‌గా ఉండే పరికరాలు ఉంచకూడదు. స్నానం చేశాక తడి శరీరంతో సెల్ ఫోన్ ఛార్జర్ ఆన్‌లో ఉండగా దానిని తాకరాదు.

అవగాహన తప్పనిసరి..

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండడం ప్రతి ఒక్కరికీ అవసరం. ప్రధాన లైన్లకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవగాహన లేని వారితో కరెంట్ పనులు చేయించకూడదు. అప్రమత్తంగా ఉంటే ప్రమాదం తప్పదు.

– హరికృష్ణ, ఎలక్ట్రికల్ ఏఈ ఎచ్చెర్ల

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

గురుపూజోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను శుక్రవారం ప్రదానం చేశారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరై గురువులకు పురస్కారాలు ప్రదానం చేశారు. వారి సేవలను కొనియాడారు.

– శ్రీకాకుళం కల్చరల్



కోడూరు సురేష్‌కుమార్, మోడల్ ప్రైమరీ స్కూల్, గార



సీహెచ్.త్రినాథరావు, ఎంపీపీఎస్ పాందరవీధి, శ్రీకూర్మం



జె.వెంకటేశ్వరి, ఎంపీపీఎస్, ఎస్.బొంతుపల్లి



బి.రాజేశ్వరి, జెడ్పీహెచ్ఎస్, ఒప్పంగి



పి.ఉషారాణి, ఎంపీపీఎస్, పెద్దపాడు



ఎస్.రమణదొర, జెడ్పీహెచ్ఎస్, తండేంవలస



కె.తిరుపతిరావు, మోడల్ స్కూల్, జి.సిగడాం



కె.వెంకటరావు, జెడ్పీహెచ్ఎస్, బుడుమూరు



టి.జగదీష్, మోడల్ స్కూల్, జి.సిగడాం



సీహెచ్.భీమారావు, ఎంపీపీఎస్, కొండములగాం



బి.రామకృష్ణారావు, జెటీడబ్ల్యూహెచ్, జయపురం

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



సమావేశం మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రణస్థలం ప్రాజెక్టు మహాసభ శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 14న పాతపట్నంలో జరిగే అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని నేటికి కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం తగదన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పని భారం పెరిగినా ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు కూడా అమలు చేయడం లేదన్నారు.

అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.సుజాత, అధ్యక్షులుగా ఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బి.అప్పమ్మ, ఉపాధ్యక్షులుగా కె.అసిరితల్లి, జి.ధనలక్ష్మి, బి.రేవతి, జి.లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బి.స్వాతి, టి.సుజాత, పి.నాగమణి, డి.సుజాత, వి.నాగమణి, కోశాధికారి బి.లక్ష్మితో పాటు 25 మందిని ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో 'తిరు ఓనం'



పూలతో ముగ్గులు వేసి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలువురు కేరళీయులు 'తిరు ఓనం' పండగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బలగలోని అయ్యప్ప దేవాలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు దేవరకొండ శంకరనారాయణ, ధర్మకర్త రెడ్డి చిరంజీవులు ఆధ్వర్యంలో బలిచక్రవర్తి పాద అర్చన, విష్ణుమూర్తి ఆవాహన పూజలు జరిగాయి. పూలతో ముగ్గు వేసి పూజలు చేశారు.

మిత్రధర్మం గొప్పది



సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : మిత్రత్వానికి మించిన ధర్మం ఈ భూమండలంలో లేదని పి.వి.సాయిప్రసాద్ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'కుచేలోపాఖ్యానం – స్నేహ ధర్మం' అనే అంశంపై శుక్రవారం ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుచేలుడు ఎంతపేదవాడైనా శ్రీకృష్ణుడు స్నేహ ధర్మంతో ఆయనను ఆదరించి సకల సంపదలను ఇచ్చాడని, స్నేహం ఎలా ఉండాలో ఆచరణలో చూపించాడని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిటైర్డ్ టీచర్లు బి.ఉమామహేశ్వరరావు, తిరుపతిరావులను సత్కరించారు. కార్యక్రమంలో కోమలరావు, శరత్‌బాబు, మురళీకృష్ణ, చంద్రరావు, నరసింహమూర్తి, విశ్వేశ్వర రావు, ఉమారాణి, అనూరాధ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న గణ పతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవా రం దీపారాధన నిర్వహించారు. మహిళలంతా హాజరై వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బి.అశ్వనీకుమార్, మహేష్, శివ ఆదిత్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురువులు సమాజ నిర్దేశకులు

గురువులే సమాజ నిర్దేశకులని వక్తలు పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను సత్కరించారు. విద్యాభివృద్ధికి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు



శ్రీకాకుళం న్యూకాలనీ: సత్కారాలు అందుకున్న బెస్ట్ టీచర్లతో అప్పస్మా జిల్లాశాఖ నాయకులు, ప్రతినిధులు



శ్రీకాకుళం న్యూకాలనీ: పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో గురుపూజోత్సవం



రణస్థలం: లావేరు గ్రంథాలయంలో రాధాకృష్ణన్ జయంతి వేడుకలు



శ్రీకాకుళం: సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో...



ఎచ్చెర్ల: లావేరులో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంఈవో-1 శ్రీరాములు, ఎంఈవో-2 మురళీకృష్ణ, ఉపాధ్యాయులు



శ్రీకాకుళం కల్చరల్: బ్రహ్మకుమారి కార్యాలయంలో ఉపాధ్యాయులకు సత్కారాలు



జి.సిగడాం: ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సత్కారం



శ్రీకాకుళం రూరల్: శాస్త్రులపేటలో ప్రిన్సిపాల్ అనూరాధకు సన్మానం



శ్రీకాకుళం: అరసవల్లి మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులు అందించిన జ్ఞాపికలతో ఉపాధ్యాయులు



శ్రీకాకుళం కల్చరల్: హర్షవిల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారం

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



గణపతిని నిమజ్జనోత్సవంలో అర్చకులు, భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ సమక్షంలో పలువురు భక్తులు గణపతి మాలను విరమించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇప్పిలి హరనాథరావు, భక్తులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకణలో అమ్మవారు

ఎచ్చెర్ల : కుంచాలకుర్మయ్యపేటలోని రాజరాజేశ్వరి అమ్మవారికి శుక్ర వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక జలాలతో అభిషేకాలను నిర్వహించి అలంకరించారు. పీఠాధిపతి బాల భాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి శ్రీచక్రాలు, మహామేరువు వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

పొందూరు: మండలంలో బురిడికంచరాం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మెండ తవుడు రూ.20 వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. అనంతరం తవుడు మాస్టారుకు పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీబాబు, పీఏసీఎస్ చైర్మన్ వండాన మురళీ, పీఎంసీ చైర్మన్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.